మత్తుతో జీవితం చిత్తు

ప్రాణాంతకమైన మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మత్తు పదార్థాల జోలికెళ్లి బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ లేని సమాజాన్ని స్థాపించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవాటు చేసుకుని మంచి జీవితాన్ని నిర్మించుకోవాలని కోరారు. మాదకద్రవ్యాలు రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం
- మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో పోలీసు అధికారులు


బుక్కపట్నంలో మానవహారం


కదిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


చెన్నేకొత్తపల్లిలో సెబ్ పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ

ధర్మవరం అర్బన్: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సెబ్ సీఐ గురుప్రసాద్, ఎస్‌ఐ శ్రీధర్‌బాబు కోరారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సెబ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ, ఎస్‌ఐ మాట్లాడుతూ గంజాయి, నల్లమందు, బ్రౌన్ షుగర్ తదితర మాదక ద్రవ్యాలు తయారు చేయుట, కలిగి ఉండుట, అమ్మడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఈ మత్తుపదార్థాలు తీసుకోవడం వల్ల జీవితం సర్వనాశనం అవుతుందని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యం దిశగా జీవితం మలుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కుళ్లాయ్‌రెడ్డి, సెబ్ పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిస కారాదు

ఓడీచెరువు : జీవితాలను నాశనం చేసే మాదక ద్రవ్యాలకు బానిస కారాదని ఓడీచెరువు ఎస్‌ఐ వంశీకృష్ణ పేర్కొన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినం సందర్భంగా మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రజలు మత్తు పదార్థాలకు అలవాటు పడితే సమాజం తిరోగమనంలో పయనిస్తుందని తెలిపారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల ఏర్పడే దుష్ఫలితాలు, అక్రమ రవాణా నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ ఫక్రోద్దీన్, శ్రీనివాస్, రామక్రిష్ణ, హెడ్‌కానిస్టేబుల్ అల్లాబకాష్, కానిస్టేబుల్ లోకేష్, హోంగార్డు గంగులీ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి స్పేస్ కళాశాలలో బుధవారం రూరల్ అప్ గ్రేడ్ సీఐ మోహన్, సెబ్ సీఐ నారాయణమ్మ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐ మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని హెచ్చరించారు. ఎక్కడైనా డ్రగ్స్ వాడుతుంటే తమ దృష్టికి తేవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌రహిత సమాజానికి కృషి

పుట్టపర్తి: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఎస్‌ఐ రమణ పిలుపునిచ్చారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం సిబ్బందితో కలిసి బుక్కపట్నంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. యువత గంజాయి తదితర మత్తు పదార్థాలకు బానిస కాకుండా సరైన మార్గంలో నడవాలని ఆయన సూచించారు. డైట్ విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి.. తేరు కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు.

చదువుతో ఉన్నత శిఖరాలు

అమడగూరు: బాగా చదువుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎస్‌ఐ మగ్బూల్‌బాషా తెలిపారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్లకార్డులు చేత పట్టుకుని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో అనర్థాలు

చెన్నేకొత్తపల్లి: ప్రస్తుతం యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని సెబ్ సీఐ లలితాదేవి అన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మోడల్‌స్కూల్ విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ స్థానిక న్యామద్దెల సర్కిల్ వరకూ కొనసాగింది. అనంతరం అక్కడే విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగాలని ఆకాంక్షించారు. పుట్టిన గ్రామానికి మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ముఖ్యంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




ధర్మవరంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న సెబ్ సీఐ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, ఓడీచెరువులో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎస్‌ఐ వంశీకృష్ణ, న్యామద్దెల సర్కిల్‌లో విద్యార్థుల ర్యాలీ

క్లుప్తంగా

న్యాయ విజ్ఞాన సదస్సు


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి జయలక్ష్మి

కదిరి అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ హరీంద్రప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి హాజరయ్యారు. మాదక ద్రవ్యాల వినియోగం, మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నాగేంద్రరెడ్డి, సీనియర్ న్యాయవాది నరసింహులు, రెడ్స్ అధ్యక్షురాలు భానూజా పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన


యాప్‌లు, చట్టాల గురించి తెలుసుకుంటున్న పోలీసు అధికారులు, సిబ్బంది

ధర్మవరం అర్బన్: సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బందికి బుధవారం ధర్మవరంలోని శ్రీషిరిడిసాయిబాబా కళ్యాణ మండపంలో డీఎస్పీ శ్రీనివాసులు సమక్షంలో నూతన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జూలై ఒకటో తేదీ నుంచి దేశంలో అమలయ్యే కొత్త చట్టాలు, సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌లో వచ్చిన అప్‌డేట్స్, ఈ సాక్ష్య యాప్, ఎఫ్ఐఆర్, చార్జ్‌షీట్‌లపై ఈ సిగ్నేచర్, డిజి లాకర్, ఎన్‌సీఆర్‌బీ సంకలన్ యాప్, కొత్త అప్‌డేట్‌లపై శిక్షకులు టీవీ ద్వారా అర్థమయ్యేలా వివరించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్య సేవలు


వైద్య చికిత్సలు అందిస్తున్న సిబ్బంది

తాడిమర్రి: ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు ఎంఎల్‌హెచ్‌పీ సీహెచ్ ఉమాదేవి పేర్కొన్నారు. పెద్దకోట్లలో బుధవారం ఆమె వైద్య సిబ్బందితో కలిసి గర్భిణులు, బాలింతలు, జబ్బుబారిన పడిన వారికి బీపీ, షుగర్, రక్తం, మూత్ర తదితర పరీక్షలు చేశారు. అనంతరం వారు రోగులకు వైద్య చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యంగా ఉండటానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అలాగే డయేరియా బారినపడకుండా పరిశుభ్రమైన ఆహారం, నీటినే తాగాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త రంగనాయకులు, ఏఎన్ఎం రేష్మా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

గాండ్లపెంట: ఉపాధి హామీ పథకం కింద సన్న,చిన్న కారు రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ రామానాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద 17 రకాల పండ్ల మొక్కలు అందిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రెవెన్యూ అధికారి నుంచి సన్నకారు ధ్రువీకరణ పత్రం తీసుకుని ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌ను దరఖాస్తుకు జత చేసి ఉపాధి హామీ కార్యాలయంలో మూడు రోజుల్లోగా అందించాలని కోరారు.

టీకాలు.. చిన్నారులకు శ్రీరామరక్ష


తాడిమర్రిలో చిన్నారులకు టీకాలు వేస్తున్న దృశ్యం

తాడిమర్రి: వ్యాధి నిరోధక టీకాలు చిన్నారులకు శ్రీరామరక్ష అని పీహెచ్ఎన్ లక్ష్మి తెలిపారు. తాడిమర్రి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం జరిగిన వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. టీకాలు జాగ్రత్తగా భద్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు. పీహెచ్ఎన్ మాట్లాడుతూ ప్రతి బుధవారం చిన్నారులకు బీసీజీ, హెపటైటిస్ బీ, ఓపీవీ, పెంటా, పీసీవీ, రోటా, ఎమ్మార్ తదితర టీకాలు వేస్తారన్నారు. ఈ టీకాలు వేయిస్తే కోరింత దగ్గు, పచ్చ కామెర్లు, తట్టు, టీబీ తదితర వ్యాధులు సోకవన్నారు. క్రమం తప్పకుండా వాటిని చిన్నారులకు వేయించాలని బాలింతలకు సూచించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లోని విలేజ్ క్లీనిక్‌ల్లో చిన్నారులకు టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు కోమలి, కృష్ణమ్మ, సుగుణ, లక్ష్మీకాంతమ్మ, నాగలక్ష్మమ్మ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్ రెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఊట్ల అక్కదేవతల పరుష


అక్కదేవతల మూల విరాట్‌లు

నల్లమాడ: ఎద్దులవాండ్లపల్లి సమీపాన ఊట్లలో వెలసిన అక్కదేవతల పరుష బుధవారం కుంకుమ కార్యక్రమంతో ముగిసింది. శనివారం నల్లమాడ నుంచి ఉరుములతో ఎలవ గంపను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. ఆదివారం విడిది దినం కాగా సోమవారం దాసంగాలు, మంగళవారం బండ్లు, బుధవారం కుంకుమ కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అక్కదేవతలను దర్శించుకుని కాయ, కర్పూరం, పసుపు, కుంకుమ సమర్పించి పూజలు చేశారు. పూజారులు దారిమేని వెంకట్రాముడు, రాము మాట్లాడుతూ ఆరు తరాల నుంచి ఏటా అక్కదేవతల ఊట్ల పరుష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

తాడిమర్రి: మండల కేంద్రం తాడిమర్రిలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని హెచ్‌డబ్ల్యూ ఎల్.శివరామిరెడ్డి కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహంలో ఎస్సీ విద్యార్థులకు 70 సీట్లు, ఎస్టీ 9, బీసీ, ఓసీ విద్యార్థులకు ఐదేసి చొప్పున సీట్లు ఖాళీ ఉన్నట్లు వెల్లడించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మూడో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత పత్రాలు, విద్యార్థి ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ నకళ్లు, తల్లి బ్యాంక్ పొదుపు ఖాతా పుస్తకంతో పాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకుని ఎస్సీ బాలుర వసతి గృహంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 79891 46954 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రూ. 1.80 లక్షలు పలికిన వారపు సంత వేలం

తనకల్లు: కొక్కంటిక్రాస్ వారపు సంత వేలం పాట రూ.1.80 లక్షలు పలికినట్లు బాలసముద్రం పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌నాయక్ బుధవారం తెలిపారు. వేలం పాటలో కె.గణేష్ అత్యధికంగా పాడి వేలాన్ని దక్కించుకున్నట్లు పేర్కొన్నారు.

చదువుపై మక్కువ పెంచుకోండి

బత్తలపల్లి: మత్తు పదార్థాలకు బానిస కాకుండా.. చదువుపై మక్కువ పెంచుకోవాలని బత్తలపల్లి ఎస్‌ఐ పి.శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ బాల్య దశలోనే మాదక ద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు బానిస అయితే జీవితాంతం వాటికే అంకితం అవుతారన్నారు. అదే విద్యపైన మక్కువ చూపితే భవిష్యత్‌లో మంచి స్థాయికి చేరుకుంటారన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కొడవండ్లపల్లి చంద్రశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు రమేష్, మురళి, చంద్రకళ, అనురాధ, రవిచంద్ర, జింతా నాయక్, నరసింహులు, అరుణ, హేమలత, వేణుగోపాల్, పోలీస్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు

నీళ్ల ట్యాంకుల శుభ్రం

నల్లచెరువు: ఉబిచర్ల గ్రామంలోని రెండు తాగునీటి ట్యాంకులను పంచాయతీ కార్యదర్శి గంగాధర్ బుధవారం సచివాలయ సిబ్బందితో శుభ్రం చేయించారు. కార్యదర్శి మాట్లాడుతూ ఎంపీడీఓ రాణమ్మ ఆదేశాల మేరకు ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్ చల్లించి శుభ్రం చేయించినట్లు చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామస్తులు తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్యపై ఆందోళన


మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజలు

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి పట్టణంలోని రెండో వార్డులో తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదట స్థానిక వార్డు ప్రజలు నీటి సమస్యపై బైఠాయించారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు తెలిపారు. కమిషనర్ కలగజేసుకొని విద్యుత్ మోటార్, పైప్‌లైన్ మరమ్మతు చేయించి తాగునీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

నివాళి


మృతురాలు పోలీస్ శాంతమ్మ (ఫైల్)

నల్లచెరువు: మండల కేంద్రం నల్లచెరువులో నివాసముండే వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కో కన్వీనర్ పోలీస్ రెడ్డెప్ప తల్లి పోలీస్ శాంతమ్మ(62) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ బసిరెడ్డి అనిత విశ్వనాథ్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు దశరథ నాయుడు, భాగ్యమ్మ, సర్పంచ్ పంచరత్నమ్మ, ఎంపీటీసీ లక్ష్మీదేవి మృతురాలి ఇంటి వద్దకు వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

29న జాతీయ లోక్ అదాలత్

మడకశిరరూరల్: ఈ నెల 29న మడకశిర కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అశోక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవాలని సూచించారు.



● కమనీయం.. ఖాద్రీశుని కల్యాణోత్సవం

కదిరిటౌన్: శ్రీదేవి, భూదేవి సమేత ఖాద్రీశుని కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. బుధవారం అర్చకులు స్వామి వారిని పలు రకాల పూలతో అలంకరించి పూజలు చేశారు. హోమాలు చేసి, శాస్త్రోక్తంగా మంత్రోచ్చారణల నడుమ అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

గాండ్లపెంట: ద్విచక్రవాహనంపై నుంచి పడి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎన్‌పీ కుంట మండలం కొండమూల కటకంవారిపల్లికి చెందిన టి.భాస్కర (38) నెల రోజుల తర్వాత మృతి చెందాడు. జమేదార్ తిరుమలరెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. భాస్కర మే 25న కదిరి నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వస్తుండగా గాండ్లపెంట సమీపంలోని పెద్ద మిట్ట వద్ద కుక్కలు అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలవడంతో కదిరి ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి.. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడి నుంచి అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా... పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. భార్య రోజా ఫిర్యాదు మేరకు జమేదార్ కేసు నమోదు చేశారు.

'విద్యా ప్రవేశం'పై శిక్షణ


శిక్షణ ఇస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎంలు

పుట్టపర్తి : బడి ఈడు పిల్లలు బడులలో చేరే విధంగా వారిలో చైతనం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'విద్యా ప్రవేశం' అనే కార్యక్రమం నిర్వహిస్తోందని ఎంఈఓ గోపాల్‌నాయక్ అన్నారు. బుధవారం బుక్కపట్నంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు 'విద్యా ప్రవేశం'పై ఆయన శిక్షణ ఇచ్చారు. బడి బయట పిల్లలను గుర్తించి తక్షణమే పాఠశాలలో చేరే విధంగా తల్లిదండ్రులు తగు చర్యలు తీసేకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జగదీశ్వర్, రహిమాన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

పెనుకొండ: మండలంలోని కొండంపల్లికి చెందిన అక్రమ మద్యం విక్రేత ఎరుకల గంగయ్యకు న్యాయమూర్తి బుధవారం 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ.రాజేష్ తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు... 2020 డిసెంబర్ 31న గంగయ్య కర్ణాటక నుంచి మద్యం తీసుకొస్తుండగా అప్పటి ఎస్ఐ. వెంకటేశ్వర్లు పట్టుకుని అతని నుంచి 48 కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అయితే అప్పటి నుంచి పరారీలో ఉన్న గంగయ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు చెప్పారు.

బాలిక అదృశ్యం

ముదిగుబ్బ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైంది. తమ కూతురు కాలేజీకి వెళ్లి కనిపించడం లేదని తల్లిదండ్రులు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నిచోట్ల వెతికినా జాడ కనిపించలేదని తెలిపారు. సీఐ యతీంద్ర కేసు నమోదు చేశారు.

రుచికరమైన భోజనం అందిచాలి

చెన్నేకొత్తపల్లి: పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని చెన్నేకొత్తపల్లి ఎంఈఓ-2 ప్రసన్నకుమార్ నాయుడు సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిధిలోని న్యామద్దెల, ముష్టికోవెల గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. అలాగే పాఠశాలల్లో కొత్త అడ్మిషన్లు ఎలా జరుగుతున్నాయని అక్కడి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్లు, పరసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని రుచి చేశారు. భోజనం నాణ్యత, మెనూ ప్రకారం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఆర్పీ నరసింహులు పాల్గొన్నారు.


ముష్టికోవెలలో భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ-2 ప్రసన్నకుమార్

నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలి

- బీజేపీ నాయకుల డిమాండ్

పుట్టపర్తి టౌన్: నామినేటెడ్ పోస్టుల్లో తమకు అవకాశం కల్పించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పుట్టపర్తిలోని జానకిరామయ్య కల్యాణమండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శేఖర్ ఆధ్వర్యంలో నియోజవర్గంలోని ఆరు మండలాల పార్టీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో భాగంగా బీజేపీ నాయకులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం నాయకులు హరికృష్ణ, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ హరినాయక్, ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు కొండమరాజు, మీడియా కన్వీనర్ జ్యోతి ప్రసాద్, జిల్లా కోశాధికారి సురేంద్రబాబు, జిల్లా ధార్మిక కన్వీనర్ బాలగంగాధర్, నరసింహులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

విద్యా సామగ్రి పంపిణీ

ముదిగుబ్బ: ముదిగుబ్బకు చెందిన సాయి ఫ్రూట్స్ యజమాని ఇందుకూరి సురేష్ బుధవారం గుడ్డంపల్లి తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫక్రుద్దీన్, నరసింహులు, మునేనాయక్, భాస్కర్ నాయక్, శివ సాయిలీల, వరలక్ష్మి, సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యా సామగ్రిని అందజేస్తున్న దాత సురేష్

పురోగాభివృద్ధికి తోడ్పాటు అందించండి

హిందూపురం టౌన్: చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే లోపాలు గుర్తించి వారి జీవితాల్లో పురోగాభివృద్ధికి తోడ్పాటు అందించాలని వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులకు డీఈఐసీ చిన్నపిల్లల వైద్యుడు ప్రేమ్‌కుమార్ సూచించారు. బుధవారం హిందూపురంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గల డీఈఐసీ (జిల్లా త్వరిత చికిత్స కేంద్రం)లో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా 0–5 సంవత్సరాలలోపు చిన్నారులలో కలిగే పలు లోపాల గుర్తింపునకు వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులకు ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. డీఈఐసీ చిన్నపిల్లల వైద్యుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ చిన్నారులలో పుట్టుకతో వచ్చే లోపాలు, వైకల్యం, అభివృద్ధిలో లోపాలు, పోషకాహార లోపం వల్ల వచ్చే వ్యాధులు, చలన, వినికిడి, మాట్లాడుట, గ్రహించటం, చూపులో తదితర లోపాలు గుర్తించే విధానం గురించి వివరించారు. వీటిని వైద్యాధికారులు ముందస్తుగా గుర్తించి డీఈఐసీకి పంపిస్తే ప్రత్యేక శిక్షకులు చిన్నారుల పరిస్థితిని సమీక్షించి, వారికి అవసరమైన చికిత్స అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అపర్ణ, ఆప్టోమెట్రీషియన్ సాయిక్రిష్ణ, జిల్లా అధికారి కార్యాలయ సిబ్బంది హరి, సిబ్బంది రఘురామ్, సోషల్ వర్కర్ మోహన్‌రెడ్డి, ఎల్‌టీ చందన తదితరులు పాల్గొన్నారు.


వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ ప్రేమ్‌కుమార్